## క్లుప్తంగా

### ముచ్చట్ల మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలోని ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆషాడ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామిఅమ్మవారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### హెల్మెట్‌తో ప్రమాదాల నుంచి రక్ష

**కోవెలకుంట్ల:** ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలోని కంపమల్ల మెట్ట వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**డోన్ టౌన్:** డోన్ ఐసీడీసీ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శంషాద్‌బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నమల్కాపురం-2(బీసీ-సీ), తిరునాంపల్లెకు (ఈడబ్ల్యూస్), ఊటకొండ-2 (బీసీ-డీ), జక్కసానికుంట్ల (బీసీ-ఏ), బేతంచెర్ల-12వ కేంద్రానికి (జనరల్), సిమెంట్‌నగర్-3 (ఎస్సీ)కి కేటాయించినట్లు వెల్లడించారు. పదో తరగతి పాసై 18 నుంచి 35 ఏళ్ల లోపు మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీలోగా దరఖాస్తుతో కుల, విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ జత చేసి ఇవ్వాలన్నారు.

### లేఔట్లలో ముళ్ల పొదలు తొలగించాలి

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రైవేట్ లే ఔట్లలో పేరుకుపోయిన ముళ్ల పొదలను తొలగించాలని ఈఓ ప్రకాష్ నాయుడు అన్నారు. ప్రజా ఆరోగ్య చట్టం కింద ప్రభుత్వ లేఔట్లలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కంపచెట్ల తొలగింపు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ లేఔట్లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి న యజమానులు ఖాళీ స్థలాలను అలాగే వదిలేయడంతో కంపచెట్లు పెరిగిపోయి పాములు, పందులు,విష సర్పాలు సంచరిస్తున్నాయని తె లిపారు. యజమానులు ఎవరి పరిధిలో వారు పరిశుభ్రంగా ఉంచుకోని పక్షంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించి ప్లాట్లను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

### ఆశా కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు

**బనగానపల్లె రూరల్:** మండలంలోని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు ఆశా వర్కర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మధుమోనిక సోమవారం తెలిపారు. పలుకూరు గ్రామ సచివాలయం-2 పరిధిలో ఒకటి, చెరువుపల్లె, నందవరం సచివాలయం-1, నందివర్గం సచివాలయ పరిధిలో ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీలోపు nandyal.ap.gov.inలో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### 10న గురు పౌర్ణమి వేడుకలు

**కోవెలకుంట్ల:** పట్టణంలో జులై 10వ తేదీ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు జనార్ధన్ తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార వాహనం ద్వారా సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీకృష్ణుడు జగద్గురువుగా పూజింపబడుతున్నారని పేర్కొన్నారు. ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు వెంకటసుబ్బయ్య, రామసుబ్బయ్య, సుబ్బరాయుడు, సుబ్బారావు, పవన్ పాల్గొన్నారు.

### వ్యాస రచన పోటీలు

**డోన్ టౌన్:** డాక్టర్ డేను పురస్కరించుకుని పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నేటి సమాజంలో వైద్యుల ఆవశ్యకతపై పోటీలు నిర్వహించినట్లు డోన్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్, రాజశేఖర్, ముస్కీంవలి, రాజేంద్రప్రసాద్, వాసుదేవచారి తెలిపారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

### తల్లికి వందనం వర్తింపజేయాలి

**ప్యాపిలి:** అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్న తమకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని అంగన్‌వాడీలు నీరజ, ఫర్జాన, రత్నా డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం వారు మాట్లాడుతూ.. నెలకు రూ. 11,500 గౌరవ వేతనం అందుకుంటున్న తాము పిల్లలను చదివించుకోవడానికి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో తమకు అమ్మ ఒడి వర్తించిందని..ప్రస్తుతం తల్లికి వందనం వర్తించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

# అన్నదాత ఆవేదన

- దెబ్బతిన్న ఎస్సార్‌బీసీ కాల్వలు
- ముళ్లపొదలు పేరుకుపోయి సాగునీరు అందక రైతుల ఇక్కట్లు
- బ్లాక్‌ల అభివృద్ధి పనులకు రూ.23 కోట్ల ప్రతిపాదనలు
- కేవలం రూ.1.80 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



ఎస్సార్‌బీసీ 9వ బ్లాక్‌లో దెబ్బతిన్న ప్రధాన కాల్వ, పేరుకుపోయిన ముళ్ల చెట్లు

**బనగానపల్లె:** నియోజకవర్గ పరిధిలోని ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలు, మైనర్, సబ్‌మైనర్ కాల్వలు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ముళ్లపొదలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. సాగునీరు సరైన సమయంలో అందక రైతులు పంట నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ కాల్వల అభివృద్ధికి సంబంధించి అధికారులు రూ.23 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. కానీ ప్రభుత్వం కేవలం రూ.1.80 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఈ నిధులతో కొన్ని ప్రాంతాల్లో ముళ్లపొదలు తొలగించే పనులు జరుగుతున్నా, పూర్తి స్థాయి అభివృద్ధికి ఇది తక్కువేనని రైతులు వాపోతున్నారు.

**ప్రతి బ్లాక్‌కు రూ.3 కోట్లు అవసరం**

ఎస్సార్‌బీసీ పరిధిలోని ప్రతి బ్లాక్‌ను పూర్తిగా అభివృద్ధి చేయాలంటే కనీసం రూ.3 కోట్లు అవసరమని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 8 నుంచి 16 బ్లాక్‌లు వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రధాన కాల్వలు మరియు చిన్నకాల్వలు (మైన్, సబ్‌మైన్) ముళ్లపొదలతో నిండిపోయి నీరు వెళ్లే దారి కుచించుకుపోయాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలో సుమారు 70 వేల ఎకరాల్లో రైతులు పంటల సాగు చేస్తున్నారు. ఎక్కువగా వరి, జొన్న, మొక్కజొన్న, మిరప తదితర పంటలు సాగు చేస్తారు.

**సాగునీటి సంఘాలు నిర్వీర్యం**

గత 20 ఏళ్లుగా సాగునీటి సంఘాలు ఏర్పాటు అవుతున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక సాగునీటి సంఘాలు కూడా నిర్వీర్యమయ్యాయి. సాగునీరు లేక రైతులు నష్టపోతున్నారు. ఇదే కొనసాగితే పంటలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఎస్సార్‌బీసీ మైనర్, సబ్ మైనర్ కాల్వలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

**వైఎస్సార్ హయాంలో ప్రారంభం**

2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఎస్సార్‌బీసీ ద్వారా ఎగుడు, దిగుడు భూములు కూడా పంట భూములుగా మారాయి. ఎస్సార్‌బీసీ అనుసంధానంగా ఉన్న పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ పూర్తి కావడంతో దశాబ్ద కాలంగా రైతులు రెండు పంటలు పండించుకుంటున్నారు. కానీ ఎస్సార్‌బీసీ కాల్వలు పతనావస్థకు చేరి అభివృద్ధికి నోచుకోకపోవడంతో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**రైతుల ఆవేదన**



కల్వర్టు వద్ద దుస్థితి

పంట కాల్వల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు పంటలకు సాగునీరు అందించేందుకు పంపుసెట్లు, పైప్‌లైన్లు వేసుకొని అధిక ఖర్చులు వెచ్చించాల్సి వస్తోంది. పలు చోట్ల ఆయకట్టుకు సాగునీరు అందక కోవెకుంట్ల సమీపంలోని కుందూ నదిలో కలుస్తోంది. నీటి వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు.

**ముళ్లపొదలతో కాల్వలు**



ఎస్సార్‌బీసీ కాల్వలు పలు చోట్ల దెబ్బతిన్నాయి. ముళ్లపొదలు నిండిపోయి నీరు వెళ్లకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. ప్రభు త్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలి.

–సురేష్‌కుమార్‌రెడ్డి, రైతు, టంగుటూరు

**నిధులు మంజూరు చేయాలి**



గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు వేయలేని పరిస్థితి ఉండేది. నియోజకవర్గంలోని రైతులు ఇబ్బందులు పడేవారు. అలాంటి సమయంలో ఎస్సార్‌బీసీ వరప్రసాదంలా మారింది. ఆ నీటితో పంటలు పండించుకోగలిగాం. కానీ ఇప్పుడు కాల్వలు అలాంటి స్థితిలో లేవు. కాల్వలు అభివృద్ధి పరిచి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీటిని అందించాలంటే ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

–వీరారెడ్డి, రైతు, టంగుటూరు

**రూ.1.80కోట్లు మంజూరు**

బనగానపల్లె నియోజకవర్గంలోని 8–16 బ్లాక్‌ల అభివృద్ధికి రూ.23 కోట్లు ప్రతిపాదించాం. ఇప్పటి వరకు రూ.1.80 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో కాల్వల్లో ముళ్లపొదలు తొలగించి అభివృద్ధి చేస్తాం.

–సురేష్‌బాబు, ఈఈ, ఎస్సార్‌బీసీ

# సమస్యలపై ఏకరువు





సమస్యలను విన్నవిస్తున్న వార్డు కౌన్సిలర్లు , సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్

- సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల విన్నపం
- పలు అభివృద్ధి పనులకు ఆమోదం

**బేతంచెర్ల:** నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్లు ఇబ్రహీం, శకుంతల, మధు, కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య, సునీల్ కోరారు. సోమవారం బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్లు లేవనెత్తారు. శ్రీనగర్ కాలనీలో 17 నెలల క్రితం ప్రారంభించిన రైతు బజారు నిరుపయోగంగా ఉందని, కోటపేట కాలనీలో సౌకర్యంగా ఉన్న సంత మార్కెట్‌ను వినియోగించుకోకుండా రహదారిపై సంత నిర్వహిస్తున్నారని వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం అన్నారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు వస్తున్నా పట్టణంలోని దుర్గాపేట, డ్రైవర్స్ కాలనీ, కోటపేట, బేగిరిపేట తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని, తరచూ పైప్‌లైన్లు పగిలిపోయి నీరు కలుషితం అవుతున్నాయని.. సాయిబాబా గుడి నుంచి ప్రధాన రహదారి వెంట రెండో పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, కందకంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ఎప్పుడు ప్రారంభిస్తారని కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య, సునీల్ ప్రస్తావించారు. పట్టణంలోని సత్రం వద్ద 800 మీటర్ల రహదారి వెంట 8 స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంపై చైర్మన్ చలంరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. అనంతరం ఆయా కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులకు సభ్యుల తీర్మాణంతో ఆమోదం తెలిపారు.

# ప్రజా ప్రయోజనాలు పట్టని కూటమి నేతలు

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు తగదు
- రిలే నిరాహార దీక్ష చేస్తున్న డాక్యుమెంట్ రైటర్స్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల సంఘీభావం



డాక్యుమెంట్ రైటర్స్ రిలే నిరాహారదీక్షకు మద్దతు ప్రకటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**డోన్:** అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి స్వప్రయోజనాలను కాపాడేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కూటమి నేతలు శివారు ప్రాంతానికి తరలిస్తుండడం సిగ్గుచేటని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్ అన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శివారు ప్రాంతంలో ఉన్న ఎంకే టౌన్‌షిప్‌లోని భవనంలోకి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్‌కు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు ప్రకటించారు. అధికార పార్టీ నాయకుల వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు.

**కోటి విలువైన భవనం వృథా**

పోలీస్‌స్టేషన్ సమీపంలోని రెవెన్యూ క్వార్టర్స్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన భవనాన్ని కాదని ఎంకే టౌన్‌షిప్‌లో సొంత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్న యజమానికి మేలు చేకూర్చాలనే దురుద్దేశంతో కార్యాలయాన్ని మార్చాలనుకోవడం శోచనీయమన్నారు. ఒక్క వ్యక్తి ప్రయోజనం కోసం వేలాది మంది ప్రయోజనాలను తాకట్టుపెట్టడం ఏంటని అధికార పార్టీ నేతలను ప్రశ్నించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, పార్టీ నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, రైల్వే నాగేంద్ర, వంశీ, ఆర్ట్ రమణ, షేక్షా, మిట్టా రవికుమార్, మౌలాలి, మేకల రాజు, మౌలాభి, పెయింటర్ వెంకటేష్, చిరంజీవి, వెంకటాపురం రాజు ఉన్నారు.

**అధికారులు వత్తాసు పలకడం దారుణం**

**డోన్ టౌన్:** ప్రభుత్వ, వంక పోరంబోకు స్థలాలను సొంత స్థలాలుగా చూపించి కోర్టును తప్పుదోవ పట్టిస్తున్న టీడీపీ నాయకుడికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలకడం దారుణమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యుడు ధర్మారం రంగనాయకులు అన్నారు. డాక్యుమెంట్ రైటర్ల రిలేనిరాహార దీక్షకు ఐఎఫ్‌టీయూ, ఐద్వా నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద 16 ఎకరాల ప్రభుత్వ, వాగు, వంక పోరంబోకు భూములు ఉన్నాయన్నారు. ఇందులో 327 సర్వే నంబరులో ఉన్న వాగు భూమిలో టీడీపీకి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించి అక్కడే ఓ కాంప్లెక్స్ నిర్మించి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను తన ఆధీనంలోకి తీసుకుని రికార్డులు తారుమారు చేసి స్థల దాతగా తన పేరు పెట్టుకుని అందరినీ తప్పుదోవ పట్టించారన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం

- రామ్‌కో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

**కొలిమిగుండ్ల:** చాలా రోజుల నుంచి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అవి పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు స్పష్టం చేశారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు, సీపీఐ, రైతు సంఘం, ఏఐటీయూసీ తదితర ప్రజా సంఘాల నాయకులు, కల్వటాల, కొలిమిగుండ్ల గ్రామాల రైతులతో కలిసి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. అంతకు ముందుగా ర్యాలీగా ఫ్యాక్టరీ ఆవరణలోకి చేరుకోగానే కంపెనీ ప్రతినిధులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమనిగింది. తర్వాత ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఫ్యాక్టరీ చుట్టు పక్కల రైతులు చీని, మామిడి, తదితర పంటలు సాగు చేసుకున్నారని సిమెంట్ తయారీకి ఉపయోగించే ముడి ఖనిజాన్ని తరలించే సమయంలో దుమ్ము, ధూళి వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పంటలను పరిశీలించి నష్టం వాటిల్లిందని నివేదికలు ఇచ్చారన్నారు. 20 రోజుల క్రితం చర్చలకు పిలిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఫ్యాక్టరీకి వ్యతిరేకం కాదని నష్టపోయిన వారికి న్యాయం జరిగి తీరాలన్నారు. చివరకు కంపెనీ ప్రతినిధులు ఈ నెల 7వ తేదీ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు పెద్దయ్య, శ్రీకాంత్‌రెడ్డి, వినయ్, శరత్ పాల్గొన్నారు.

# రోడ్డుపై మురుగు.. జనం బేజారు



డ్రైనేజీ సక్రమంగా లేక రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

**బనగానపల్లె రూరల్:** మండలంలోని టంగుటూరు నుంచి నందవరం వైపు వెళ్లే రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టంగుటూరుతో పాటు రాయపాడు, గోస్పాడు, నంద్యాల నుంచి నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి వచ్చేందుకు దగ్గరి మార్గం కావడంతో భక్తులు ఈ రోడ్డు మీదుగానే వస్తుంటారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అయితే రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### అధ్వానంగా నల్లబల్లి రహదారి



గుంతలు ఏర్పడిన రహదారి

**ప్యాపిలి:** ప్యాపిలి–జొన్నగిరి రహదారి అధ్వానంగా మారింది. 2019లో అప్పటి టీడీపీ హయాంలో నాబార్డు నిధులు రూ.3.2 కోట్లతో ఈ రోడ్డును నిర్మించారు. పదేళ్లు కాకముందే రోడ్డు ఛిద్రమైంది. ఐదు కిలోమీటర్ల మేర రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మార్గం మీదుగా నల్లబల్లి, ఉప్పర్లపల్లె, జొన్నగిరి తదితర గ్రామాలకు ప్రతి రోజూ ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. గుంతలను గమనించని వాహన చోదకులు అతివేగంగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### నట్టల నివారణతో జీవాలు సురక్షితం

**సంజామల:** గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం ద్వారా జీవాలు సురక్షితంగా ఉంటాయని పశుసంవర్థక శాఖ ఏడీ కొండారెడ్డి అన్నారు. జులై 10వ తేదీ వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంజామల, కొలిమిగుండ్ల మండల గొర్రెల కాపరులు జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలని తెలిపారు.

### నేలబెలుంలో వర్షం కోసం పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

**కొలిమిగుండ్ల:** వర్షం కోసం బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పూజలు చేశారు. 101 బిందెలతో శివలింగానికి జలాభిషేకం చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో కళకళలాడాలనే ఉద్దేశంతో పూజలు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### అర్చకుని మృతికి నివాళి

**డోన్:** పట్టణంలోని ఇందిరానగర్‌లో గుండెపోటుతో మృతిచెందిన ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణశర్మ మృతిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్వగృహం వద్ద మృతదేహానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల రాజు, నాయకులు గడ్డం సురేష్, మల్లికార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివ, విజయ్, రంగస్వామి నివాళులర్పించారు.

### విద్యాసామగ్రి పంపిణీ

**డోన్ టౌన్:** మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డాక్టర్ ఫిక్సిట్ ఫెవికాల్ డోన్ డీలర్ రమేష్ ఆర్థిక సహకారంతో సోమవారం పలకలు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసినట్లు స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. సర్పంచ్ బోయ రాణి, స్కూల్ కమిటీ చైర్మన్ సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ సన్మానం



కొలిమిగుండ్ల: హెచ్‌ఎం జయరామిరెడ్డికి సన్మానం



యనకండ్ల పాఠశాల హెచ్‌ఎం శివశంకర్‌రావు

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ పొందారు. వారికి అధికారులు, తోటి ఉద్యోగులు, బంధుమిత్రులు పూలమాలలు, శాలువాలు వేసి సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. శేషజీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

–సాక్షి నెట్‌వర్క్



అవుకు ఎంపీడీఓ వెంగన్న సన్మాన కార్యక్రమం



ప్యాపిలి: లెక్చరర్ సత్యబాబుకు సన్మానం

# ముఖం చాటేస్తున్న వరుణుడు



ఆర్‌ఎస్ రంగాపురంలో కమ్ముకున్న మేఘాలు



వర్షం లేక ఎదుగదల లేని పంట

**బేతంచెర్ల:** ఖరీఫ్ ప్రారంభమై 25 రోజులు అవుతున్నా సరైన వర్షం పడక మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. మొత్తం 14 వేల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉండగా 12 వేల హెక్టార్లలో వర్షం ఆధారంగా ఖరీఫ్‌లో వేరుశనగ, కందులు, కొర్ర, పత్తి, ఆముదాల పంటలను సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో పంటల సాగు కోసం దుక్కులు దున్ని, ఎరువులు చల్లి పొలాలను సిద్ధం చేసుకున్నారు. బ్యాంకులు సకాలంలో రుణాలు ఇవ్వకున్నా ఆశల జూదానికి మరోసారి అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉండడం మినహా రైతులు విత్తనాలు విత్తు కోవడానికి సరైన వర్షం పడకపోవడంతో దిగులు చెందుతున్నారు. వరుణుడి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో గత నెలాఖరులో వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో విత్తనాలు వేసినా మండంలో పూర్తి స్థాయిలో విత్తలేదు. వేసిన విత్తనాలు మొలకెత్తినా ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులతో దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కొలువుదీరిన పీర్లు



రంగరాజుపేటలో కొలువుదీరిన పీర్లు

**కోవెలకుంట్ల:** మొహర్రం పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల సందడి మొదలైంది. ఈ నెల 26వ తేదీ నెలవంక దర్శనం ఇవ్వడంతో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. కోవెలకుంట్లతో పాటు మండలంలోని సౌదరదిన్నె, అమడాల, బిజనవేముల, గుళ్లదూర్తి, జోళదరాశి, భీమునిపాడు, రేవనూరు గ్రామాల్లో పీర్లచావిళ్లలో పీర్లను కొలువుంచారు. పట్టణంలోని పెద్దబార్ ఇమాం, చిన్నబార్ ఇమాంచావిళ్ల వద్ద మంగళవారం తెల్లవారుజామున పీర్ల పెట్టెల ఊరేగింపు కార్యక్రమం కొనసాగనుంది. ఆయా చావిళ్లలో మంగళవారం పీర్లను కొలువుంచనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి సరిగెత్తు వేడుకలు ప్రారంభం కానున్నాయి.

**సంజామలలో..**

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభం అయ్యాయి. పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి పీర్లను కొలువుంచారు. మరికొన్ని చోట్ల మంగళవారం కొలవుతీరనున్నాయి. సంజామల, ఆకుమల్ల గ్రామాల్లో పీర్ల దేవుళ్లకు భక్తులు ఫాతేహాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు.